# గుండెపోటుతో ఎస్ఐ మృతి



మృతి చెందిన ఎస్ఐ సంజయ్ సావంత్(ఫైల్)

హైదరాబాద్ (మన్సూరాబాద్), డిసెంబరు 3, ప్రభాతవార్త: ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న సంజయ్ సావంత్ (58) మంగళవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఎల్బీనగర్ సీఐ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన సంజయ్ దశాబ్దాల క్రితం నగరానికి వచ్చి స్థిర పడ్డారు. కాగా 1989లో కానిస్టేబుల్‌గా పోలీస్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో 2011లో హెడ్ కానిస్టేబుల్‌గా తరవాత 2018లో సబ్ ఇన్ స్పెక్టర్‌గా పదోన్నతి పొంది గత రెండు సంవత్సరాలు నుండి ఎల్బీనగర్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఐతే మంగళవారం రాత్రి విధులు ముగించుకుని స్టేషన్‌లో ఉన్న విశ్రాంతి గదిలో పడుకున్నాడు. కాగా రాత్రి సమయంలో కొంచెం అస్వస్థతకు గురికావడంతో పోలీస్‌లు సంజయ్ కుమారుడుకి సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి మంచి నీళ్ళు త్రాపించి ఆరోగ్యం బాగానే ఉందనడంతో సంజయ్ కుమారుడు వెళ్ళిపోయాడు. తిరిగి బుధవారం ఉదయం స్టేషన్‌లోని పోలీసులు ఎస్ఐ సంజయ్‌ను లేపే ప్రయత్నం చేశారు. కానీ సంజయ్ అచేతనంగా పడి ఉండటంతో వెంటనే కామినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి చూడగా ఎస్ఐ గుండె పోటుతో మరణించినట్లు తెలిపారు. వెంటనే ఎల్బీ నగర్ పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్టేషన్‌లో తమతో ఎంతో సన్నిహితంగా ఉండే ఎస్ఐ అకస్మాతుగా మృతి చెందడంతో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

### వీధి కుక్కల దాడి కేసు

# మూగబాలునికి మెరుగైన వైద్యం అందించాలని సిఎం ఆదేశం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబరు 3:హయత్‌నగర్‌లో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన మూగ బాలుడు ప్రేమ్ చంద్ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించారు. బుధవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, ఈ ఉదయం పత్రికల్లో ఈ వార్తను చూసి కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో మాట్లాడి, బాలుడికి అత్యుత్తమ వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. గాయపడిన బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసాఇచ్చారు. వారికి అవసరమైన తక్షణ సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. కమిషనర్ స్వయంగా ఆసుపత్రికి వెళ్లి బాలుడి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకుని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, నగరంలో వీధి కుక్కల సమస్యపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.గతంలో జరిగిన సంఘటనలను గుర్తుచేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి దురదృష్టకర ఘటనలు పునరావృతం కాకుండా వీధికుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# నాకు రక్తం మరిగిపోయింది..

## 'ఎక్స్'వేదికపై కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త: తెలంగాణకు ప్రాజెక్టులు ఇస్తావా లేదా చస్తావా అని ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నాకు రక్తం మరిగిపోతుందని 'ఎక్స్'వేదికపై కేంద్ర మంత్రి బండి సంజయ్ బుధవారం ట్వీట్ చేశారు. విశ్వవ్యాప్తంగా దేశ ప్రతిష్టను పెంచుతున్న 75యేళ్లు కలిగిన ప్రధాన మంత్రిని పట్టుకుని రేవంత్ రెడ్డి 'ఇస్తావా లేదా చస్తావా" అంటూ వ్యాఖ్యలు చేసినా ప్రధాని మాత్రం ఆ మాటలను పట్టించుకోకుండా తెలంగాణ అభివృద్ధికోసం రేవంత్ రెడ్డితో సమావేశమైనారనీ ట్వీట్‌లో పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని మోడీతో సమావేశం కొనసాగుతున్న సమయంలోనే ఎక్స్ వేదికగా బండి సంజయ్ స్పందించడం విశేషం. మంగళవారం గాంధీభవన్‌లో సమావేశంలో సిఎం మాట్లాడుతూ 'ఢిల్లీలో ప్రధానిని కలిసి రాష్ట్ర ప్రాజెక్టులకు సంబంధిచి అడగబోతున్నామని మనం అడిగే ప్రాజెక్టులకు కేంద్రం ఓకే చెప్తే సరే లేదా రాష్ట్రంలో బిజెపిని ఏం చేయాలో ప్రజలు అదే చేస్తారు' అంటూనే ప్రధానిపై విద్వేషపూరితమైన మాటలు అన్నా రాష్ట్ర అభివృద్ధికోసం వాటిని పక్కన పెట్టి రేవంత్ రెడ్డి తనను కలిసేందుకు ప్రధాని అవకాశం ఇచ్చారని ట్వీట్‌చేశారు. మోడీ ఎప్పుడూ ప్రజలకోసం మంచి చేసే రాజనీతిజ్ఞుడు అని అదే అత్యున్న విశ్వా సం అని రాసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చాలా సహకరిస్తోం దని ఇది నేను చెబుతున్న మాట కాదని గతంలో సిఎం స్వయంగా చెప్పా రంటూ వీడియోను సైతం బండి సంజయ్ షేర్ చేశారు. రాజకీయాలను ప్రజల అభివృద్ధి సంక్షేమం ఒకే గాటలో కట్టని ఈ ఉద్దేశ్యం తన బాస్ మోడీని ప్రత్యేకంగా నిలబెడుతుందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

### లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయి కుమార్, ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లు

### అదుపులోకి తీసుకొని విచారిస్తున్న ఎసిబి అధికారులు



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్, ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లు

తాండూరు, డిసెంబరు 3, ప్రభాతవార్త :తాండూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ లంచావతారం ఎత్తారు. డబ్బులు ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని, ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ల ద్వార అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. విసుగు చెందుతున్న బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అధికారులు దాడులు నిర్వహించారు. రూ.16,500 లంచం తీసుకుటుండగా అధికారులు ట్రాప్ చేసి ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయి కూమార్‌తో పాటు ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సబంధించి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డిఎస్పీ ఆనంద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ తాండూరు ప్రాంతానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్‌వ్యాపారి తనకు సబందించిన 11డాక్యుమెంట్‌లను కుటుంబ సభ్యులతో పాటు విక్రయదారులకు రిజిస్ట్రేషన్ చేపించేందకు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించారు. అయితే, ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయికుమార్ రూ.2వేల చొప్పున 11 డాక్యుమెంట్లకు రూ.22వేలు లంచం డిమాండ్ చేశారు. ఇందుకు సంబందించి కార్యాలయం ముందు ఉన్న డాక్యూమెంట్ రైటర్ అశోక్, సాయిలను సంప్రదించాలని సూచించారు. దీంతో సదరు వ్యాపారి అంత డబ్బులు ఇవ్వలేక ఏసీబీ అధికారులను సంప్రదించాడు. మరో మారు వ్యాపారి ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయి కుమార్‌ను సంప్రదించగా డాక్యూమెంట్ రైటర్ అశోక్, సాయిల ద్వార ఒక్కో డాక్యూమెంట్‌కు రూ.1500 చొప్పున 11 డాక్యుమెంట్‌లకు రూ. 16500లకు ఒప్పందం కుదుర్చుకున్నారు. నాలుగు డాక్యుమెంట్‌లను రిజిస్ట్రేషన్ చేయగా మిగతా ఏడు రిజిస్ట్రేషన్ కోసం లంచం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో లంచం ఇవ్వడం ఇష్టంలేని వ్యాపారి ఏసీబీ అధికారులను ఆశ్రయించగా బుధవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డిఎస్పీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో తాండూరు సబ్ రిజిస్ట్రర్ కార్యాల యంలో రెక్కీ నిర్వహించి ఇద్దరు డాక్యూమెంట్ రైటర్లు అశోక్, సాయి ద్వార ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయికుమార్‌కు లంచం డబ్బు ఇస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయికుమార్ ఇంట్లో కూడ అధికారులు సోదాలు జరిపారు. సాయి కూమార్‌తోపాటు ఇద్దరు డాక్యు మెంట్ రైటర్లు అశోక్,సాయిలపై కేసు నమోదు చేయడం జరిగిందని, వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఏసీబీ డిఎస్పీ ఆనంద్‌కుమార్ వెల్లడించారు.

# వరంగల్‌లో డిజిటల్ సేవల విస్తరణపై కేంద్రం దృష్టి సారించాలి

### రోడ్లు-డ్రైనేజ్ పునరుద్ధరణకు ప్రత్యేకంగా రూ.100 కోట్లు మంజూరు చేయాలి

### పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హైదరాబాద్,డిసెంబరు3,ప్రభాతవార్త:వరంగల్ డిజిటల్ సేవలు విస్తరణ చేయడంతోపాటు డిజిటల్ భద్రతను మరింత పటిష్టం చేయాడానికి కేంద్ర ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టిందని ఎంపి డా. కడియం కావ్య లోకసభలో వేసిన ప్రశ్నకు బుధవారం కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ సామాధానం ఇచ్చారు. డిజిటల్ సేవలు, పోస్టల్ సేవల డిజిటలీకరణ, డిజిటల్ సాక్షరత, సైబర్ భద్రతపై ఎంపీ వివరణ ఇస్తూ జిల్లాలో 5జి సేవల విస్తరణ కోసం ఇప్పటి వరకు 209 బిటిఎస్ టవర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీంతో వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు మరింత విస్తరించనున్నాయని పేర్కొన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా దేశవ్యాప్తంగా 1.64 లక్షలకు పైగా పోస్టాఫీసులు బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. పిఎంజిడిఐఎస్‌హెచ్‌ఎ పథకం కింద తెలంగాణలో 12.10 లక్షల మందికి పైగా డిజిటల్ శిక్షణ అందగా, వరంగల్ జిల్లాలో 43,382 మంది లబ్ధి పొందినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 6.39 కోట్ల మంది శిక్షణ పొంది, 4.39 లక్షల సీసీల ద్వారా ఈ కార్యక్రమం అమలైనట్టు కేంద్రం తెలిపింది. సైబర్ ముప్పులను ఎదుర్కొనేందుకు సిఇఆర్‌టిఐఎన్ హెచ్చరికలు, శిక్షణలు, సైబర్ స్వచ్ఛత కేంద్రం కార్యక్రమాలు, అవగాహన కీలకమని మంత్రి పేర్కొన్నారు. కడియం కావ్య వరంగల్ నగరంలో అక్టోబర్‌లో మెంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలు, తుఫాను వల్ల కలిగిన భారీ నష్టంపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో జీరో అవర్‌లో గళమెత్తారు. కేంద్రప్రభుత్వం రోడ్లు-డ్రైనేజ్ పునరుద్ధరణకు ప్రత్యేకంగా రూ.100 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

# విండోస్ బ్రేక్..విమాన రాకపోకల్లో తీవ్ర అంతరాయం



న్యూఢిల్లీ, డిసెంబరు 3: మైక్రోసాఫ్ట్ విండోస్‌లో ఏర్పడిన సమస్య వల్ల దేశవ్యాప్తంగా విమానాల రాకపోకల్లో తీవ్ర ఆలస్యం చోటుచేసుకుంటోంది. ప్రయాణికుల చెక్ ఇన్ వ్యవస్థ మొరాయిం చడంతో విమానాలు ఆలస్యమవు తున్నాయని అధికారులు తెలిపారు. దీంతో దేశంలోని పలు విమానాశ్రయాల్లో ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలు ఆలస్యమవు తున్నాయి. దీంతో శబరిమల వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శంషాబాద్ లో పలు విమానాలు రద్దు చేసారు. శంషాబాద్ నుంచి ఢిల్లీ, మదురై, బెంగళూరు, గోవా, కోల్‌కతా, భువనేశ్వర్ వెళ్లాల్సిన 7 విమానాలను అధికారులు రద్దు చేశారు. అదేవిధంగా వివిధ నగరాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన 12 విమానాలు కూడా రద్దయినట్లు అధికారులు పేర్కొన్నారు. నిర్వహణ కారణాల వల్ల ఈ విమాన సర్వీసులు రద్దయినట్లు విమానయాన సంస్థలు వెల్లడించాయి. విండోస్ సేవల్లో అంతరాయం వల్లే జరిగిందని ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ విండోస్ సేవలకు అంతరాయం కలిగిందని నిపుణులు తెలిపారు. దీంతో ఎయిర్‌పోర్టుల వద్ద ఐటీ సర్వీసులు, చెక్ ఇన్ వ్యవస్థలు పనిచేయడంలేదని వెల్లడించారు. దీంతో విమానాశ్రయాల్లో చెక్ ఇన్, బోర్డింగ్ ప్రక్రియలను ఎయిర్ పోర్ట్ సిబ్బంది మాన్యువల్ గా చేస్తున్నారు. దీనివల్ల విమాన సర్వీసులు ఆలస్యమవుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ సమస్యపై మైక్రోసాఫ్ట్ సంస్థ కానీ, విమానయాన సంస్థలు కానీ ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# పుట్టిన పసికందు వీధిపాలైతే..వీధి కుక్కల కాపలా!

### స్థానికులు చూసి ఆసుపత్రిలో చేర్చిన వైనం

కోల్‌కత్తా, డిసెంబరు 3: పశ్చిమ బెంగాల్ లోని నబద్వీప్ పట్టణంలో జరిగిన సంఘటన ఇంటర్నెట్‌ను షేక్‌చేసింది.అప్పుడే పుట్టిన పసికందును ఒక మహాతల్లి నడిరోడ్డుపై వదిలేసి వెళ్లగా వీధికుక్కలు ఆ బిడ్డకు రక్షణగా రాత్రంతా కాపలా కాశాయి. బిడ్డ చుట్టూ రక్షణ కవచంలా నిలుచున్నాయి. ఆ పసికందు సమీపంలోకి పురుగును కూడా రానివ్వలేదు. పూర్తిగా తెల్లవారిన తర్వాత స్థానిక మహిళ ఒకరు బిడ్డ దగ్గరికి వెళ్లగా ఇక తమ బాధ్యత పూర్తయిందన్నట్టు ఆ శునకాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. ఈ సంఘటన స్థానికుల్లో తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. నదియా జిల్లాలోని నబద్వీప్ పట్టణం రైల్వే వర్కర్ల కాలనీలో పబ్లిక్ టాయిలెట్ ముందు అప్పుడే పుట్టిన పసికందు కనిపించింది. బిడ్డపై రక్తపు మరకలు కూడా పోలేదు. పుట్టిన వెంటనే ఆ బిడ్డను తల్లి వదిలేసి వెళ్లింది. రోడ్డుపై ఆ బిడ్డను గమనించిన వీధి కుక్కలు అక్కడికి చేరుకున్నాయి. వాటి సహజ ప్రవర్తనకు భిన్నంగా ఆ బిడ్డ చుట్టూ రక్షణ వలయంగా నిలుచున్నాయి. సుశిక్షితులైన బాడీగార్డుల్లాగా రాత్రంతా కాపలా కాసిన ఆ శునకాలు చిన్న పురుగును కూడా బిడ్డ సమీపంలోకి రానివ్వలేదు. పూర్తిగా తెల్లవారాక వీధి కుక్కల మధ్య పసికందును గమనించి స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఓ మహిళ ధైర్యంచేసి బిడ్డ దగ్గరకు వెళ్లగా మా డ్యూటీ పూర్తయింది, ఇకపై ఆ బిడ్డ రక్షణ నీదే అన్నట్లు శునకాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. కనీసం దుప్పటి కూడా లేకుండా రాత్రంతా చలిలో ఉన్న ఆ బిడ్డను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రస్తుతం ఆ పసికందు ఆరోగ్యంగా ఉందని నబద్వీప్ పట్టణ చైల్డ్ హెల్ప్ అధికారులు పేర్కొన్నారు.

# పెరిగిన ఎరువులు, రసాయనాల వినియోగం

### వ్యవసాయ మంత్రి తుమ్మల



హైదరాబాద్, నవంబరు 3,ప్రభాతవార్త: రాష్ట్రం లో ఎరువులు, రసాయన పురుగుల మందుల వాడకం గణనీయంగా పెరిగిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆందోళన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో బుధవారం జరిగిన మహాకిసాన్ మేళ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం తెలంగాణలో గత పదేళ్లలో భారీగా పెరిగిందన్నారు. ప్రస్తుతం భారతదేశ వినియోగం, అన్ని రకాల ఎరువులు కలుపుకొని 600 లక్షల టన్నులు ఉంటే, ఒక్క తెలంగాణలోనే 40 లక్షల టన్నులుగా ఉందని తెలిపారు. అదేవిధంగా దేశంలో సగటు పురుగుమందులు వినియోగం కంటే కూడా రాష్ట్రంలో వినియోగం అధికంగా ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో కేవలం ఉత్పత్తి మీదనే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు తీయడం మీద దృష్టిసారించాలని సూచించారు. తరువాత వివిధ జిల్లాల నుండి ఎంపిక చేఐసిన ఆదర్శరైతులకు రైతురత్న అవార్డులను అందచేశారు. మహాకిసాన్ మేళాలో భాగంగా రైతుల ప్రయోజన నిమిత్తం ఏర్పాటు చేసిన 70 స్టాల్స్ రైతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడులో భారీ వర్షాల ముంపు కట్టడిలో ప్రభుత్వ వైఫల్యం

### టివికె చీఫ్ విజయ్

చెన్నై, డిసెంబరు 3: తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్, చెన్నైతో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన జలమయానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డీఎంకే ప్రభుత్వం నాలుగన్నరేళ్లుగా డ్రైనేజీ పనులను అసంపూర్తిగా, అసమర్థంగా చేపట్టడమే ప్రస్తుత దుస్థితికి కారణమని ఆయన తీవ్రంగా విమర్శించారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "చెన్నైతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల సామాన్య ప్రజల జీవితాలు అతలాకుతలమయ్యాయి.

ఈ కష్టాలకు అసలు కారణం ప్రభుత్వం డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా, పూర్తిగా నిర్మించకపోవడమే. ప్రజలపై ప్రభుత్వానికి కొంచెం శ్రద్ధ ఉన్నా, కొద్దిరోజుల వర్షానికే నగరం ఇలా నీట మునిగేది కాదని విజయ్ పేర్కొన్నారు. వర్షపు నీటి కాలువల ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించినప్పటికీ, ప్రభుత్వం ఫలితాలు చూపడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజలందరూ సురక్షితంగా, జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేసిన విజయ్, వరద బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించాలని తన పార్టీ కార్యకర్తలను కోరారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరిన్ని ఇబ్బందులు కలగకుండా, వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.





బుధవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిజెవైఎం, మహిళా మోర్చా కార్యకర్తలు

# సిఎం దేవుళ్లను నిందించారని గాంధీభవన్ ముట్టడికి బిజెపి యత్నం

### భారీగా పోలీసుల మోహరింపు

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముక్కోటి హిందూ దేవుళ్ళను నిందించారని ఆరోపిస్తూ బిజెవైఎం, మహిళా మోర్చా కార్యకర్తలు గాంధీభవన్ ముట్టడికి యత్నించడంతో బుధవారం ఉద్రిక్తవా తావరణం నెలకొంది. బుధవారం ఉదయం నుంచి పోలీసులు పెద్దఎత్తున బిజెపి కార్యాలయం వద్ద మోహరించి నిరసనకారులను కట్టడి చేసే ప్రయత్నంచేశారు. బిజెపి మహిళా మోర్చా నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొన్నారు.

రేవంత్ దిష్టిబొమ్మకోసం పోలీసులకు బిజెపి కార్యకర్తలకు మధ్యతోపులాట జరిగింది. పోలీసుల తోపులాట, ఉద్రిక్తతల మధ్య రేవం త్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. తోపు లాటలో అనేక మంది బిజెపి కార్యకర్తలు గాయ పడ్డారని పార్టీనేతలు ఆరోపించారు. శాంతి యు తంగా నిరసన చేస్తుంటే క్రూరంగా అణిచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసహనానికి పరాకాష్ట అని బిజెపి ఆరోపిస్తూ ఎక్‌వేదికపై ట్వీట్ చేసింది. హిందు సమాజాన్ని అవమాన పరిచిన రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బిజెపి డిమాండ్ చేసింది.

ఇది ఇలా ఉంటే అనేక మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్వంత పూచికత్తుపై వదిలిపెట్టారు.

# వర్షిత ఆత్మహత్య ఘటనపై సుమోటో కేసు

### 10న పూర్తి ఆధారాలతో హాజరు కావాలంటూ చైతన్య కళాశాల ఛైర్ పర్సన్‌ని ఆదేశించిన మహిళా కమిషన్

హైదరాబాద్ (బేగంపేట), డిసెంబరు 3,ప్రభాతవార్త: బాచుపల్లి శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం చదువుతూ ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని వర్షిత అలియాస్ వర్ష ఘటనపై తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ సుమోటో కేసునమోదు చేసి విచారణ ప్రారంభించింది.ఈ మేరకు బుధవారం తెలంగాణా రాష్ట్ర మహిళా కమిషన్ ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది.ఈ నేపధ్యంలో కమిషన్, విద్యార్థుల సంక్షేమం,మానసిక ఒత్తిడి, పర్యవేక్షణ వ్యవస్థ,భద్రతా చర్యలు వంటి అంశాలపై నిర్లక్ష్యం కొనసాగుతున్నట్లు వివిధ స్థాయిలలో అందిన ఫిర్యాదులపై కమిషన్ ఛైర్ పర్సన్ నిర్వహించిన తనిఖీల తర్వాత కూడా పరిస్థితులు మెరుగుపడలేదని గమనించామన్నారు.ఈ పరిస్థితులలో కమిషన్ శ్రీచైతన్య కళాశాలల ఛైర్‌పర్సన్‌ని డిసెంబరు 10వ తేదీన వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ నోటీసు జారీ చేసిందన్నారు. వర్షిత ఘటనకు సంబంధించిన పరిస్థితులు కళాశాల తీసుకున్న చర్యలు,గత తనిఖీల తర్వాత కూడా కొనసాగుతున్న సమస్యలు,కమిషన్ సూచనల అమలు స్థితి విద్యార్థుల భద్రత, మానసిక సంక్షేమం కోసం ప్రస్తుతం అమలు చేస్తున్న చర్యలపై వివరమైన నివేదికతో హాజరుకావాలని ఆదేశించింది.

# 87 ఆన్‌లైన్ రుణయాప్‌ల బ్లాక్..

### పార్లమెంటుకు మంత్రి వెల్లడి




న్యూఢిల్లీ, డిసెంబరు 3: సామాన్య, మధ్య తరగతి ఆర్థిక బలహీనతలు ఆసరాగా చేసుకుని లోన్‌యాప్‌లు దారుణాలకు తెగబడుతున్నాయి. వీటిని కట్టడిచేసేందుకు చట్టాలను సైతం ప్రయోగించినా మళ్లీ పుట్టుకువస్తున్నాయి. ఇలాంటి యాప్‌లపైనే కేంద్రం షాక్ ఇచ్చింది. దేశంలో 87 అక్రమ రుణయాప్‌లను బ్లాక్‌చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆన్‌లైన్ రుణకార్యకలాపాల్లో పాల్గొన్న కంపెనీలపై 2013 కంపెనీల చట్టంప్రకారం విచారణ, ఖాతాల తనిఖీలు, దర్యాప్తులతో సహా నియంత్రణ చర్యలు కాలానుగుణంగా నిర్వహించబడుతున్నాయని కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష్‌మల్హోత్రా వివరించారు. పనిచేయని సంస్థల పర్యవేక్షణను మెరు గుపరిచేందుకు చట్ట విరుద్ధ కార్యకలాపాల నిర్మూలనకు ఏ చర్యలున్నాయని మంత్రిని ప్రశ్నించారు. ఉల్లంఘనలు జరిగినప్పుడల్లా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. చట్టాలకు అనుగుణంగా లేని రుణయాప్‌లను బ్యాన్ చేస్తున్నామని, అందులో భాగంగానే 87యాప్‌లు బ్లాక్‌చేసామని, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వశాఖ తక్షణ చర్యలు తీసుకున్నట్లు మంత్రి వివరించారు.



# రెండు కొత్తబీమా ప్లాన్‌లు విడుదలచేసిన ఎల్ఐసి

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త: జీవిత బీమా సంస్థ సిఇవో, ఎండి ఆర్ దొరైస్వామి రెండు కొత్త బీమా ప్లాన్‌లను బుధవారం లాంఛనంగా ప్రారంభించి వినియోగదారుల కోసం విడుదలచేశారు. ఎల్ఐసి ప్రొటక్షన్‌ప్లస్,బీమా కవచ్ ప్లాన్‌లు ఎంతో గొప్ప ప్రయోజనాలతో రూపొందించామని దొరైస్వామి తెలిపారు. ఎల్ఐసి ప్రొటక్షన్ ప్లస్ నాన్‌పార్‌లింక్,లైఫ్ సేవింగ్‌తోపాటు టర్మ్ పాలసీ అని తెలిపారు.18నుంచి 50 ఏళ్ళవారికి ఇది వర్తిస్తుంది బీమా కవచ్ ప్లాన్ వంద సంవత్సరాల వరకు పొడిగించారు. చనిపోయాక కుటుంబంకు బెనిఫిట్స్ వస్తాయి.

# చిత్రపురి కాలనీ అక్రమాలపై విచారణ పూర్తి

### పలువురు సినీ పెద్దల పాత్ర, 15 మంది బాధ్యులుగా నిర్ధారణ

హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త: తెలుగు చలన చిత్రపరిశ్రమకు చెందిన హైదరాబాద్‌లోని చిత్రపురి కాలనీ అక్రమాలపై విచారణ పూర్తయింది. చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీలో ప్లాట్ల కే టాయింపులో 2005 నుంచి 2020 వరకూ జరిగిన అవకతవలపై నియమించిన ప్రత్యేక కమిటీ విచారణ జరిపింది. ఈ మేరకు కోఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ అక్రమాలకు సంబంధించి ఫైనల్ రిపోర్టులో 15 మందిని బాధ్యులుగా చేర్చినట్లు తెలుస్తోంది. పాత, ప్రస్తుత కమిటీ సభ్యుల పాత్ర ఉందంటూ నివేదికలో కమిటీ పేర్కొంది. ఫైనల్ రిపోర్టులో పలువురు సినీ పెద్దల పేర్లు ఉన్నట్లు వెల్లడైంది. పలువురు సినీ పెద్దలు కమిటీలో ఉంటూ నిధులు కాజేశారని రిపోర్టులో పేర్కొన్నారు. పలువురు సినీ పెద్దల పాత్రపై రిపోర్టులో కీలక అంశాలను డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రస్తావించారు. అక్రమాలకు పాడిన వారి వద్ద నుండి రూ.43.78 కోట్లు రికవరీ చేయాలని రిపోర్టులో పేర్కొన్నారు. అదనంగా 18 శాతం చెల్లించాలని ఆదేశాలను జారీ చేశారు.

# వదల 'బొమ్మా'ఔ..మళ్లీ కస్టడీ పిటిషన్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్3: ఐబొమ్మ రవికి పోలీసులు షాకిచ్చారు. రెండోసారి కస్టడీ పూర్తయిన వెంటనే ఐబొమ్మ రవి బెయిల్ పిటిషన్ వేశారు. అయితే, మరో నాలుగు కేసుల్లో అతడిని కస్టడీకి ఇవ్వాలని సైబర్ క్రైమ్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒక్కో కేసులో 7 రోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ వేశారు. అయితే, గురువారం కౌంటర్ వేయాలని ఐబొమ్మ రవి అడ్వకేట్‌కు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు ఒకే కేసులో రవిని పోలీసులు రెండుసార్లు కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. అటు కస్టడీ పూర్తి కావడంతో రవి బెయిల్ పిటిషన్‌పై న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

# హౌస్‌లోన్ మోసం కేసులో ఇద్దరికి 7 సంవత్సరాల జైలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్3: హౌస్ లోన్ మోసం కేసులో భార్యభర్తలకు నాంపల్లి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు 7సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు సిఐడి ఏడీజిపి చారు సిన్హా తెలిపారు. రూ.30వేల జరిమానా విధించినట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పుప్పల దశరథ్,లక్ష్మీబాయి దంపతులపై 2011లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) సికింద్రాబాద్ బ్రాంచ్ ఏజిఎం ఫిర్యాదుతో సిఐడి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. 2007లో ఎయిర్ కార్గో బ్రాంచ్ నుంచి నకిలీ పత్రాలతో రూ.24లక్షల హోమ్ లోన్ తీసుకున్నారు. జీడిమెట్ల ప్రాంతంలో ఇండిపెండెంట్ హౌస్ ఉన్నట్లు నకిలీ పత్రాలు బ్యాంక్‌కు సమర్పించారు. నకిలీ పత్రాలతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్ కూకట్‌పల్లి బ్రాంచ్,కెనెరా బ్యాంక్ కుందన్‌బాగ్ బ్రాంచ్‌లో లోన్ తీసుకున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. లోన్‌లను తిరిగి చెల్లించలేదని తెలిపారు. దర్యాప్తు చేపట్టిన సిఐడి 17 సాక్ష్యధారాలతో 60 డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు.చీటింగ్,ఫోర్జరీ,నేరపూరిత కుట్ర కింద నమోదైన కేసులను విచారించి నాంపల్లి కోర్టు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

# రేపు డయల్ యువర్ 'టిటిడి ఇఒ'

తిరుమల,డిసెంబర్ 3 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకు వచ్చిన భక్తులకు వెంకన్న దర్శనంలోగానీ, వసతి కల్పనలో ఎదురైన అనుభవాలు, ఇబ్బందులు, తమతమ సూచనలు,సలహాలు తెలిపేందుకు 5వతేదీ శుక్రవారం తిరుమలలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరగనుంది. దేశవిదేశాల్లోని భక్తులు తమతమ ఫిర్యాదులు, సూచనలను శుక్రవారం ఉదయం 9నుంచి 10గంటల వరకు 0877-2263261 నంబర్లకు ఫోన్‌ద్వారా నేరుగా టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌తో మాట్లాడే అవకాశం కలుగుతుంది.

# 'దిత్వా' తుఫాన్‌తో తిరుమలలో కుంభవృష్టి

తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి: దిత్వా తుఫాన్ ప్రభావంతో బుధవారం ఉదయం నుండి చిరుజల్లులతో పలకరించిన వర్షం సాయంత్రం గంటపాటు కుండపోతవాన కురిసింది. ఉన్నఫళంగా ఒక్కసారిగా బలమైన వర్షంతో భక్తులు పరుగులు తీశారు. గత నాలుగురోజులుగా దిత్వా ప్రభావంతో జడివాన కురుస్తోంది. బుధవారం సాయంత్రం కుండపోత వానతో ఓ వైపు జోరువర్షం మరోవైపు విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం మారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు.

